క్లుప్తంగా

బీమా చెక్కు పంపిణీ



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో మంగళవారం కేర్ హెల్త్ ఇన్స్యూరెన్స్, యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ప్రమాద బీమా చెక్కు అందజేశారు. యూనియన్ రిన్ సురక్షలో రూ.1499 చెల్లించి ప్రమాదవశాత్తూ మృతి చెందిన పి.జ్యోతి కుటుంబ సభ్యులకు రూ.5లక్షల ప్రమాద బీమా చెక్కు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జైజీవన్, బ్రాంచి మేనేజర్ ఇ.రాధికలు అందజేశారు. జైజీవన్ మాట్లాడుతూ యూనియన్ రిన్ సురక్ష పథకం ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ బీమా పథకంలో చేరాలన్నారు. కార్యక్రమంలో కేర్ హెల్త్ ఇన్స్యూరెన్స్ ఏరియా హెడ్ నాగార్జున, ఏఏహెచ్ కె.కిరణ్‌కుమార్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు మందులు పంపిణీ

ఫిరంగిపురం: బిడ్డకు జన్మనిస్తూ ఏ తల్లీ మృతి చెందరాదని, జన్మిస్తూ ఏ బిడ్డా మృతి చెందకూడదనే నినాదంతో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ యోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఫిరంగిపురం సెక్టారు వైద్యురాలు పి.ఎస్తేరురాణి అన్నారు. మండలంలోని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పీఎస్ఎంఎస్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు వివిధ రకాల పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఎస్తేరురాణి మాట్లాడుతూ గర్భిణులు ఐదో నెల నుంచి ప్రసవించేంత వరకు ప్రతినెలా పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. అందులో హైరిస్క్ ఉన్న వారిని గుర్తించి తగిన జాగ్రత్తలు పాటించేలా అవగాహన కల్పిస్తామని చెప్పారు. మెరుగైన వైద్యం కోసం పెద్ద వైద్యశాలలకు రిఫర్ చేస్తామన్నారు. రక్తహీనత ఉన్న వారిని గుర్తించి వారికి ఐరన్ సిక్రోజ్ ఇంజెక్షన్లు విడతల వారీగా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యమే మహోన్నత శక్తి



తాడేపల్లిరూరల్: మానసిక ఆరోగ్యమే మహోన్నత శక్తికి మూలమని ప్రముఖ మానసిక వైద్య నిపుణురాలు మానస అన్నారు. వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మానస మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మానసిక ఆరోగ్యం నిమిత్తం జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మానసిక ఆరోగ్యం సాధించిన వారు అత్యుత్తమమైన శక్తిని పొంది విజేతలుగా నిలబడతారని వివరించారు. వర్సిటీ సైకాలజిస్ట్ ఎం.విజయరత్నం మాట్లాడుతూ శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకునే వారు విజేతలవుతారని అన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, మహిళా అభివృద్ధి సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూతు రమ్య, వాల్యూ ఎడ్యుకేషన్ సెంటర్ సైకాలజిస్ట్ శంకర్, తేజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో విదేశాలకు పార్శిల్



ఫిరంగిపురం: అతి తక్కువ ఖర్చుతో పోస్టల్ ద్వారా విదేశాలకు పార్శిల్ సేవలు అందిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండల కేంద్రంలోని హెడ్ పోస్టాఫీసులో నేషనల్ పోస్టల్ వారోత్సవాల సందర్భంగా మంగళవారం వివిధ పథకాలపై వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కత్తిరేణమ్మ మాట్లాడుతూ పోస్టల్‌లో ప్రజలకు ఉపయోగపడే పలు బీమా పథకాలు ఉన్నాయని చెప్పారు. పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ వంటి పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. అంతేకాక సేవింగ్ పథకాలు అయిన ఎస్‌బీ, ఆర్‌డీ, టీడీవంటి వాటి ద్వారా ప్రజలకు పోస్టల్ ఎంతో ప్రయోజనకరమైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెనాలి ఎక్సైజ్ ఎస్ఐ మందాళ అనిత, చిలుకలూరిపేట పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సతీష్, పోస్టుమాస్టర్ ఫణీంద్ర, ఎస్‌పీఎంలు, బీఎంఎస్‌లు, ఏబీఎంఎస్‌లు వినియోగదారులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి రక్ష... జగనన్న ఆరోగ్య సురక్ష

- భారీగా తరలివచ్చిన ప్రజలు
- వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసిన సిబ్బంది
- యర్రబాలెంలో అపూర్వ ఆదరణ



దామరపల్లి గ్రామంలో వైద్య శిబిరాన్ని సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా

మంగళగిరి: ప్రజల ఆరోగ్యానికి రక్ష..జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అని నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ హేమమాలిని అన్నారు. మంగళవారం నగర పరిధిలోని యర్రబాలెం వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరై పరిశీలించిన హేమమాలిని మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీతో పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి ప్రజల ఇంటి వద్దకే కార్పొరేట్ వైద్యాన్ని అందించడం అభినందనీయమన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి రూపాయి భారం లేకుండా నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రజలు సంతోషంగా వ్యక్తం చేస్తున్నారన్నారు. గ్రామ, వార్డు స్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం గతంలో ఎన్నడూ జరగలేదని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షకు ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఎంపీహెచ్ఈవో సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ పీజే విలియమ్స్, ఏసీడీపీఓ కె సరిత, సూపర్‌వైజర్ జి వేణుకుమారి, డాక్టర్ రాజేష్, వైద్య ఆరోగ్యశాఖ ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా దుగ్గిరాల మండలం శృంగారపురం గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ, సర్పంచ్ కొండూరు సుధారాణి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ శృంగారపురంలో వైద్యులు ఇంటింటికి తిరిగి పరీక్షలు నిర్వహించి 635 మందికి వివిధ ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. ప్రస్తుతం నిపుణులైన వైద్యులతో పరీక్షలు జరిపించినట్లు తెలిపారు. కంటి సమస్యలు ఉన్న 15 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా మందులు అందజేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు శ్రీరామరక్ష అని, ఎంతోమంది పేదలు వారి శరీరంలో వచ్చిన మార్పులను త్వరగా గుర్తించరని, ప్రభుత్వ వైద్యులు ఇంటికి వెళ్లి వారితో మాట్లాడడం వల్ల వారి సమస్యలు తెలుస్తాయని, వారు చెప్పిన దాన్ని బట్టి వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇచ్చే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉయ్యూరు రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్), జిల్లా ఉపాధ్యక్షులు వడ్డేశ్వరపు రజనీ కాంత్, మండల అధ్యక్షులు శృంగారపాటి రత్నం, ఎంపీటీసీ సభ్యులు కూచిపూడి సురేష్, తహసీల్దార్ మల్లేశ్వరి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ముత్తయ్య, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరి శరత్, వైద్యులు ప్రభాకర్ శివ, ఎండి అబ్దుల్ రహమాన్, కె.తాజుద్దీన్, సుకన్య, వివి కర్ణ తదితరులు పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య పరీక్షలకు హాజరైన రోగులు

ఇంటి ముంగిటకే వైద్య సేవలు

దామరపల్లి(తాడికొండ): పేదవాడికి అందని ద్రాక్షగా ఉన్న వైద్య రంగాన్ని చేరువ చేసి ఇంటి ముంగిటకే వైద్యులు వచ్చి సేవలందించేంత దగ్గరకు చేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని ఉమ్మడి గుంటూరు జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. తాడికొండ మండలం దామరపల్లి గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. రోగులకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వాలు విద్య, వైద్య రంగాలను పూర్తిగా విస్మరించడంతో కార్పొరేట్ శక్తులు దోపిడీ చేస్తున్నాయని, దీనిని గమనించిన ముఖ్యమంత్రి జగనన్న నాడు– నేడు ద్వారా విద్యా వ్యవస్థను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారని అన్నారు. 108, ఆరోగ్యశ్రీ 104, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి శిబిరాల ద్వారా వైద్య రంగాన్ని పేదవాడి ఇంటి తలుపు తట్టేలా చేశారని కొనియాడారు. జగనన్న పాలన దేశానికే ఆదర్శమని, మరో 50 సంవత్సరాలు జగనన్నే ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. అవినీతి పార్టీలు ఎంతమందితో పొత్తులు పెట్టుకున్నా రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 175/175 సీట్లు సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నల్లిబోయిన సరస్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి, మార్కెట్ యార్డు చైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, పార్టీ మండల అధ్యక్షులు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, స్థానిక నాయకులు నల్లిబోయిన శ్రీనివాస్, వెంకట్రావు, వెంకట నాగేశ్వరరావు, మండల ప్రత్యేకాధికారి, పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్, తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్రబాబు, ఎంపీడీఓ అత్తోట దీప్తి పాల్గొన్నారు.



మందులు అందజేస్తున్న ఎంపీపీ సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ తదితరులు



పరీక్షలు చేస్తున్న వైద్యులు యానీగ్రేస్, ఫరీనాబేగం

402 మందికి జగనన్న ఆరోగ్య సురక్ష పరీక్షలు

ఫిరంగిపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యాన మండలంలోని యర్రగుంట్లపాడు గ్రామ ఎంపీయూపీ పాఠశాలలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు యానిగ్రేస్, ఫరీనా బేగం, భీమేష్‌నాయక్, మేఘనలు 402 మందికి వివిధ రకాల పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్యురాలు ఫరీనాబేగం మాట్లాడుతూ గ్రామంలో 832 గృహాలు ఉండగా 2170 జనాభా ఉన్నారని చెప్పారు. 402 మందికి వైద్య పరీక్షలు చేసి వారిలో 139 మందికి కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు. తహసీల్దార్ పద్మనాభుడు ఆరోగ్య శిబిరాన్ని సందర్శించి పరీక్షలు చేయించుకున్న వారి వద్దకు వెళ్లి పరీక్షలు అందుతున్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కేశవరావు, పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు, సీహెచ్‌వో వెంకటలక్ష్మి, పీహెచ్ఎన్ గాయత్రీదేవి, హెచ్‌వీ నూర్ ఖాజాబీ, హెచ్ఎస్ కె.సుదర్శన్‌రాజు, ఏఎన్ఎం శ్రీలక్ష్మి, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు, అంగన్‌వాడీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అండగా ఎమ్మెల్యే ఆర్కే

యర్రబాలెం(మంగళగిరి): నగర పరిధిలోని యర్రబాలెంలో 12 నిరుపేద కుటుంబాలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అండగా నిలిచారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న 12 కుటుంబాల నివాసాలను అధికారులు తొలగించారు. దీంతో తాము అద్దెలు కట్టుకోలేమని నిర్వాసితులు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే 12 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.10వేలు, మొత్తం రూ లక్షా 20వేలు అందజేయడంతోపాటు నివాసాలు కోల్పోయిన నిర్వాసితులకు వెంటనే ప్రభుత్వ స్థలాలు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అద్దె చెల్లించేందుకు నగదు ఇవ్వడంతోపాటు ఇళ్ల స్థలం, ఇంటి నిర్మాణానికి చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే ఆర్కేకు బాధితులు ధన్యవాదాలు తెలిపారు. నిర్వాసితులకు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు గుండాల శ్రీనివాసరావు, పలగాని కోటేశ్వరరావు, కాపరౌతు సుందరయ్య, దానబోయిన నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఇద్దరికి సీఎం సహాయ నిధి చెక్కులను మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ పెనుమాక అధ్యక్షులు దామేష్‌రెడ్డి, నాయకులు బొక్క ప్రసన్నకుమార్ (నాని) నాయకులు అందజేశారు. వారు మాట్లాడుతూ పెనుమాక గ్రామానికి చెందిన ఆళ్ల సుబ్బారెడ్డికి రూ.10లక్షలు, యర్రబాలెం అంబటినగర్‌కు చెందిన మధువర్షిణికి రూ.2.20 లక్షలు మంజూరయ్యాయని, ఈ చెక్కులను వారికి అందజేశామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి భుజంగరావు, బషీర్ తదిరులు పాల్గొన్నారు.

మార్పులపై అవగాహనకు సదస్సులు దోహదం

తాడేపల్లిరూరల్: న్యాయ శాస్త్రంలో చోటుచేసుకుంటున్న మార్పుల పట్ల అవగాహన కల్పించడానికి ఇలాంటి సదస్సులు దోహదపడతాయని కేఎల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ అన్నారు. వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో మంగళవారం మేధో సంపత్తి హక్కులపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షులు పొట్లూరి భాస్కరరావు హాజరయ్యారు. వర్మ మాట్లాడుతూ యూనివర్సిటీలో న్యాయ కళాశాల అధ్యాపకులకు, విద్యార్థులకు ఉపయోగపడే మేధో సంపత్తి హక్కుల గురించి అవగాహన కల్పించడానికి ఈ సదస్సును ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి వ్యక్తికి ఉండే మేధోసంపత్తి పట్ల హక్కులను కలిగి ఉండాలని అన్నారు. జపాన్, కెనడా, శ్రీలంక, మార్టియస్ వంటి పలు దేశాల నుంచి 250 మంది పైగా నిపుణులు, విద్యావేత్తలు పాల్గొని విద్యార్థులకు మేధో సంపత్తి హక్కుల గురించి అవగాహన కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ సెంటర్ అధిపతి డాక్టర్ రాఘవరావు, ఎంహెచ్ఎస్ అంతర్జాతీయ సంబంధాల డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, కెఎల్ న్యాయ కళాశాల విభాగాధిపతి విజయసుధ, ప్రొఫెసర్ డాక్టర్ కామసాయి తదితరులు పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభిస్తున్న పి.భాస్కరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు

సంతోషానికి తొలిమెట్టు మానసిక ఆరోగ్యం

తాడేపల్లిరూరల్: సంతోషమైన జీవితానికి తొలిమెట్టు మానసిక ఆరోగ్యమేనని, మానసిక ఆరోగ్యం బాగుంటే మనలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, ప్రతికూల పరిస్థితులను అధిగమించే శక్తి లభిస్తుందని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ జి.శేఖర్‌బాబు అన్నారు. మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం తాడేపల్లిలోని చిగురు బాలల గ్రామంలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యాన ఆటల పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మానసిక సమస్యలు ఎక్కువగా కనిపిస్తే విజయవాడ పెజ్జోనిపేటలోని కేంద్రం (9490492020)లో సంప్రదించవచ్చన్నారు.

ఉర్దూ పాఠశాల సందర్శన

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని నులకపేటలో ఉన్న ఉర్దూ పాఠశాలను మంగళవారం సమగ్ర శిక్ష రాష్ట్ర ఉర్దూ పరిశీలకులు షేక్ అబ్దుల్ ఘని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలలో చదివే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల భౌతిక వసతులు, విద్యార్థుల హాజరు, జీవీకె తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ షేక్ జిలాని మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి పాఠశాలకు 12 కుర్చీలను అందజేయడం సంతోషంగా ఉందని, ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష రాష్ట్ర ఉర్దూ పరిశీలకులు షేక్ అబ్దుల్ ఘని

మేరా మట్టి... మేరాదేశ్ ర్యాలీ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మేరా మట్టి–మేరాదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ మేరా మట్టి–మేరా దేశ్ కార్యక్రమాన్ని చేపట్టారని, మనం మన మట్టిని కాపాడుకోవాలి, ప్లాస్టిక్ వ్యర్థాలతో నేలతల్లిని నింపుతున్నామని, భావితరాలకు ఇది మంచిది కాదని అన్నారు. నేల సారవంతంగా ఉంటేనే పంటలు బాగా పండుతాయని, రసాయన ఎరువులతో నేలను పాడుచేయవద్దని, సేంద్రియ ఎరువులతో నేలను కాపాడుకోవాలని అన్నారు. అందరిచేత ప్రతిజ్ఞ చేయించిన అనంతరం పంచాయతీ కార్యదర్శులు, విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరిటెండెంట్ దేవరపల్లి వీరయ్య, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మి, మణికంఠ, శరత్, వెంకటరావు, రామలింగేశ్వరరావు, బాపయ్యచౌదరి, ఎంపీటీసీ సభ్యులు కొండూరు సుమన్, ఆత్మకూరు నాగేశ్వరరావు, పలుకూరు శామ్యూల్, డ్వాక్రా సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ

అందరూ రాకుంటే ప్రజా సమస్యలపై చర్చించేదెలా!

- మండల పరిషత్ సమావేశం సభ్యుల ఆవేదన
- అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం

తాడికొండ: మండల పరిషత్ సమావేశానికి అన్ని విభాగాలకు చెందిన అధికారులు అందుబాటులో ఉండాలని, అరకొరగా అధికారులు హాజరు కావడంతో ప్రజా సమస్యలపై చర్చించాలంటే కుదరడం లేదని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కోరారు. మంగళవారం తాడికొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ మండలంలో విద్యుత్ లోవోల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని, విద్యుత్ స్తంభాలు పడిపోయి ఉండటం, చిన్నపాటి సమస్యలకు సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని బండారుపల్లి సర్పంచ్ ముప్పాళ్ల మనోహర్, తాడికొండ సర్పంచ్ తోకల సరోజినీ నరసింహారావు అన్నారు. తాడికొండ జగనన్న కాలనీలో రెండో సైట్‌లో నిర్మాణాల కోసం గృహ నిర్మాణ శాఖాధికారులు అనుమతులు మంజూరు చేశారని, కానీ అక్కడ తాగునీరు ఇతర వసతులు లేని కారణంతో ప్రారంభించలేని పరిస్థితి ఉందని చెప్పగా తాగునీటి వసతి కల్పించేందుకు రూ.1.34 కోట్లు నిధులు మంజూరయ్యాయని, పనులు ప్రారంభం కానందున తాత్కాలికంగా నీటి సరఫరా అందిస్తామని తాగునీటి సరఫరా విభాగం ఏఈ తెలిపారు. సర్వసభ్య సమావేశానికి పోలీసు, వ్యవసాయ శాఖల అధికారులు అసలు రావడం లేదని, కారణంగా సమస్యలు చర్చించడం ఎలా అని ప్రశ్నించారు. వ్యవసాయ శాఖ నుంచి అందుతున్న రాయితీలు, విత్తనాలు, ఎరువుల సరఫరాపై ప్రజాప్రతినిధులకే అవగాహన లేకుంటే ప్రజలకేం చెప్పాలో మీరే సూచించండి అన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన అందరికీ చేరవేయాలంటే ప్రజాప్రతినిధులకు అధికారులు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. వచ్చే సమావేశంలోఅన్ని విభాగాలకు చెందిన అధికారులు సర్వసభ్య సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని లేకుంటే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రతి ఒక్కరూ ఆరోగ్య శిబిరంలో పరీక్షలు నిర్వహించుకునేలా అన్ని శాఖల అధికారులు సమష్టిగా పని చేసి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో తమ వంతు పాలుపంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి, వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, ఎంపీడీవో అత్తోట దీప్తి, డిప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్ పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వివిధ విభాగాల ప్రగతి నివేదికలను తెలియజేస్తున్న అధికారులు

సంక్షేమ ఫలాలు అందాలంటే జగన్‌ను గెలిపించాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, ప్రభుత్వ సలహాదారు బ్రహ్మానందరెడ్డి

తాడికొండ: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం అన్ని వర్గాలకు సమానంగా అందాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఉమ్మడి గుంటూరు జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అన్నారు. మంగళవారం తుళ్లూరులోని హెచ్ఎస్ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించిన ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతిపక్షంలో సుదీర్ఘ పాదయాత్ర చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడి గుండె చప్పుడు తెలుసుకొని నవరత్నాల సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వాటిని విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. అవినీతి రహితంగా పేదలకు సంక్షేమాన్ని అందించామని చెప్పుకునే ధైర్యం గత ప్రభుత్వాలకు ఉందా అని ప్రశ్నించారు. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీలు అని చెప్పుకునే జగనన్న అది మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపించి మహిళలతోపాటు అన్ని రంగాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు 60 శాతం వరకు నామినేటెడ్ పోస్టులు, ఉద్యోగాలు, పదవులు ఇచ్చి పెద్దపీట వేశాడనడంలో సందేహం లేదన్నారు. పుట్టబోయే బిడ్డ దగ్గర నుంచి వృద్ధాప్యంలో ఉన్న ప్రతి అవ్వా తాతకు మనువడిగా జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటివద్దకే వచ్చి అందిస్తుండటం ఆయన చిత్తశుద్ధి పాలనకు నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు మేనిఫెస్టో సాక్షిగా ఇచ్చిన హామీలు 98 శాతం అమలు చేసి ప్రజల ముందుకు వస్తున్నారన్నారు. ఎంతమంది నాయకులు, ఎన్ని పార్టీలు ఏకమై ప్రజలను మభ్యపెట్టాలని చూసినా విజ్ఞతతో ఉన్న ప్రజలు వారి మాటలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్పొరేట్‌కు దీటుగా నేడు విద్య, వైద్య రంగాలను తీర్చిన జగనన్న రైతులకు వ్యవసాయంలో సాయమందించేందుకు రైతు భరోసా కేంద్రాలను నిర్మించి కల్తీ లేని ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు, యంత్ర పరికరాలు సరసమైన ధరలకు రైతులకు అందిస్తూ రైతు బాంధవుడిగా నిలుస్తున్నారని కొనియాడారు. జగనన్న సురక్షా కార్యక్రమం రాష్ట్రంలో విజయవంతంగా కొనసాగుతూ పేదల ఇంటి ముంగిటకే వైద్యసేవలు అందడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, ఈ దెబ్బతో కార్పొరేట్ వైద్య మాఫియా కిందకు దిగి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొప్పుల శేషగిరిరావు, జేసీఎస్ మండల కన్వీనర్ బండి ప్రసాద్, ఆలూరి పెద శ్రీనివాసరావు, ఆలోకం సురేష్ ఎస్సీ నాయకులు శృంగారపాటి సందీప్, ఆరేపల్లి జోజి, బెజ్జం రాంబాబు, పెదపరిమి సొసైటీ అధ్యక్షుడు ముప్పంగి కోటిరెడ్డి, తుమ్మూరు రమణారెడ్డి, సోషల్ మీడియా కో కన్వీనర్ నల్లూరి జ్యోతి, బత్తుల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, వేదికపై ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి

భీమినేనివారిపాలెంలో చోరీ

మేడికొండూరు: మండలంలోని భీమినేనివారిపాలెంలో మంగళవారం చోరీ జరిగింది. సీఐ వాసు కథనం.. గ్రామానికి చెందిన హైమావతి, అంజమ్మ తల్లీకూతుళ్లు. అంజమ్మ భర్త ఇటీవల మృతిచెందడటంతో తల్లి హైమావతి వద్ద ఉంటుంది. గేదెలు మేపేందుకు మధ్యాహ్నం అంజమ్మ పొలానికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి తల్లి హైమావతి రక్తపు గాయాలతో కిందపడి ఉండటం గమనించి లోపలకు వెళ్లి చూడగా ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. రూ.10 వేలు నగదు పోయినట్లు అంజమ్మ పోలీసులకు తెలిపింది.